సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



ఆశ చూపారు.. రూ.లక్షలు కాజేశారు.. - 8లో
రాజాంలోని ఓ యువకుడిపై సైబర్ నేరగాళ్లు వలవిసిరారు. రూ.8.95లక్షలు కాజేశారు.



ఆరుగురికి తీవ్రగాయాలు
గంట్యాడ మండలంలోని కొర్లాం, తామరపల్లి గ్రామాల మధ్యలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. - 8లో

విరబూసిన బ్రహ్మకమలాలు



రాజాం పట్టణ పరిధిలోని వాసవీనగర్‌లో నివసిస్తున్న మెప్మా టీఎంసీ ఎస్.వి.రత్నం ఇంట బ్రహ్మకమలాలు విరబూశాయి. ఒక మొక్కకు ఆదివారం రాత్రి 14 పూలు వికసించాయి. వీటిని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. - రాజాం సిటీ

న్యూస్‌రీల్

1.5 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్



చెరకును తరలించేందుకు సిద్ధంచేస్తున్న రైతులు

రేగిడి: సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో 1.5 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్టు ఏవీపీ పట్టాభిరామిరెడ్డి సోమవారం తెలిపారు. వర్షాలు కారణంగా వారం రోజుల పాటు చెరకు క్రషింగ్ నిలుపుదలచేశామన్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులకు కటింగ్ ఆర్డర్లు అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు 3 వేల మెట్రిక్ టన్నుల చెరకు గానుగ ఆడుతున్నామన్నారు. కర్మాగారానికి చెరకును తరలించిన వారంరోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నట్టు వెల్లడించారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు యశోదమ్మ



సాలూరు రూరల్: న్యూఢిల్లీలోని త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో వచ్చేనెల 3 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ పోటీలకు మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎస్.యశోదమ్మ ఎంపికైంది. ఆమెను కోచ్ పోట్నూరు శ్రీరాములతో పాటు సర్పంచ్ సువ్వాడ శశికళ, గ్రామ పెద్దలు అభినందించారు.

చదురుగుడికి పెదపోలమాంబ




పెదపోలమాంబ ఘటానికి పూజలు చేస్తున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మేనత్త పెద పోలమాంబ సోమవారం గ్రామానికి చేరుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా పెద పోలమాంబ అమ్మవారిని రాత్రి ఎనిమిది గంటల సమయంలో గ్రామంలోకి ఆహ్వానించారు. ముందుగా అమ్మవారికి శీబిల్లిపెద్దవలస రోడ్డు వద్ద పూజారి కుటుంబీకులు, రివున్నాయుళ్లు, గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు కోలాట ప్రదర్శనలు, మేళతాళాల నడుమ అమ్మవారిని చదురుగుడికి తీసుకొచ్చారు. గ్రామ మహిళలు దారిపొడవునా అమ్మవారి ఘటానికి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. మంగళవారం నుంచి పెద్దమ్మవారు వారం రోజుల పాటు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. జనవరి 6న తోలేళ్ల ఉత్సవం, 7న పెద్ద పండుగ, 8న అనుపోత్సవం నిర్వహిస్తారు. జనవరి 8న చినపోలమాంబను గ్రామంలోకి తెచ్చేందుకు చాటింపు వేస్తారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.వి.సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గంజి కాశినాయుడు, పూడి దాలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన భోగాపురం ఎంపీపీ పోరాటం

- ఏడు నెలలకు స్టాంప్‌డ్యూటీ నిధులు రూ.4.73 కోట్లు విడుదల

పూసపాటిరేగ: స్థానిక సంస్థలకు మంజూరు చేయాల్సిన భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం స్టాంప్ డ్యూటీ నిధులు ఎట్టకేలకు విడుదలయ్యా యి. 2022 సంవత్సరం నుంచి భోగాపురం రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి స్టాంప్‌డ్యూటీ నిధులు పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాలకు విడుదల కావాల్సి ఉంది. దీనిపై భోగాపురం ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఫిర్యాదుచేశారు. భూరిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన డబ్బుల్లో 5 శాతం నిధులు స్థానిక సంస్థలకు విడుదల చేయాలని కోరారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు స్పందించి నిధులు విడుదల చేశారు. 2022లో ఏడు నెలల కాలానికి భోగాపురం రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో స్టాంప్‌డ్యూటీ కింద 4.73 కోట్లు విడుదల చేశారు. జిల్లా పరిషత్‌కు రూ.90 లక్షలు, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండల పరిషత్‌లకు రూ.90 లక్షలు, ఆయా పంచాయతీల పరిధిలో రిజిస్ట్రేషన్ల ప్రాప్తికి రూ.2.93 కోట్లు విడుదలయ్యాయి. ఇవి స్థానిక సంస్థల పరిధిలో అభివృద్ధి పనులకు ఉపయోగపడతా యని, ఎంపీపీ అనూషరెడ్డి, వైఎస్సార్‌సీపీ భోగాపురం మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి కృషిని ప్రజాప్రతినిధులు అభినందించారు.



సైబర్ వల.. గంజాయితో విలవిల

- ఏడాదిలో పెరిగిన సైబర్, గంజాయి కేసులు
- యథేచ్ఛగా హత్యలు, కిడ్నాప్‌లు
- మహిళలపై అఘాయిత్యాల్లో స్వల్ప తగ్గుదల
- గత ఏడాదిలో క్రైం రేటును వెల్లడించిన జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి



విలేకరుల సమావేశంలో ఏడాదిలో జరిగిన నేరాల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి, పాల్గొన్న పోలీస్ అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్:

ఒడిశా సరిహద్దు వెంబడి ఉన్న జిల్లా కావడంతో గంజాయి రవాణాకు బ్రేకులు పడడం లేదు. పోలీసులు ఎంతగా గస్తీ పెంచినప్పటికీ.. వారి కళ్లు గప్పి, నేరగాళ్లు గం'జాయ్'గా వెళ్లిపోతున్నారు. 2023 కంటే కేసుల సంఖ్య.. ఈ ఏడాదిలో పెరగడమే ఇందుకు నిదర్శనం. మరోవైపు 'సైబర్' కేటుగాళ్లు నయా పంథాలో ప్రజలను బుట్టలో వేసేస్తున్నారు. ఉచ్చులో దింపి, ఖాతాలను ఖాళీ చేసేస్తున్నారు. ఇవి మినహా.. మరికొన్ని నేరాల సంఖ్య తగ్గ ముఖం పట్టడం కాస్త సాంత్వన కలిగించే విషయం. నేరాల నియంత్రణపై దృష్టి సారించిన జిల్లా పోలీసు శాఖ.. దాదాపుగా అన్ని రకాల నేరాల గణాంకాలను తగ్గిస్తూ ప్రజల్లో శాఖపై నమ్మకాన్ని పెంచిందని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి తెలిపారు. పార్వతీపురం పోలీస్ సంక్షేమ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2024 ఏడాదికి గాను వార్షిక నేర నివేదికను వెల్లడించారు. 2024లో జిల్లా పోలీసు శాఖ సాధించిన ప్రగతి.. ఛేదించిన కేసుల వివరాలను తెలియజేశారు.



మూడు హత్యలు.. నాలుగు కిడ్నాప్‌లు



జిల్లాలో ఈ ఏడాది కూడా నేరాల నియంత్రణ ఆశించిన స్థాయిలో లేదు. మూడు హత్యలు.. నాలుగు కిడ్నాప్‌ల వలే పరిస్థితి ఉంది. హత్యల్లో అధికంగా లాభాపేక్ష సంబంధితమేనని పోలీసులు చెబుతున్నారు.

- 2023లో హత్యలు, హత్యాయత్నాలు, కిడ్నాప్ తదితర కేసులు 175 నమోదు కాగా.. 2024 లో కేవలం 04 శాతం తగ్గి 168 కేసులు నమోదయ్యాయి.
- ఆస్తికి సంబంధించిన చోరీ కేసుల్లో స్వల్ప తగ్గుదల ఉండడంతో పాటు.. రికవరీలో పోలీసులు పురోగతి సాధించారు. చోరీ ఘటనలకు సంబంధించి 2023లో 126 కేసులు నమోదయ్యాయి. రూ.56,80,752 మేర విలువైన ఆస్తులు చోరీకి గురయ్యాయి. వాటిలో 48 శాతం రికవరీతో రూ.27,06,956ల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- 2024లో 13 శాతం తగ్గుదలతో 109 కేసులు నమోదయ్యాయి. రూ. 98,83,910ల విలువైన ఆస్తులు చోరీకి గురికాగా.. 58 శాతం రికవరీతో రూ.57,65,731ల విలువైన ఆస్తులను స్వా. ధీనం చేసుకున్నారు.

అబలపై అఘాయిత్యాలు



మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతున్నాయి. ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ.. అబలలపై దాడులు ఆగడం లేదు.

- 2023లో రేప్ కేసులు 11 కేసులు నమోదు కాగా.. 2024లో 10 కేసులు నమోదయ్యాయి.
- మహిళల గౌరవానికి భంగం కలిగించే ఘటనలకు సంబంధించి 2023లో 58.. 2024లో 48 కేసులు నమోదయ్యాయి.
- 2023లో పోక్సో కేసులు 18, 2024లో 16 కేసులు నమోదయ్యాయి.
- 2023లో మహిళలకు సంబంధించిన నేరాలు 189.. 2024లో 165 కేసులు నమోదు.

ఎస్పీ ఏమన్నారంటే : మహిళలపై నేరాలను తగ్గించేందుకు పాఠశాలలు, కళాశాలల్లోనూ, గ్రామాల్లోనూ పోక్సో చట్టాల మీద, మహిళల భద్రత చట్టాల మీద అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఉమన్ సేఫ్టీ యాప్ ప్రతిఒక్కరి మొబైల్ ఫోన్లలోనూ ఉండాలని.. ఆపద సమయాలలో ఉపయోగించి పోలీస్ సహకారం పొందాలని కోరారు.

ఏరులై పారిన మద్యం

జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. నాటుసారా జోరుగా రవాణా అవుతోంది. మద్యంపై నియంత్రణ లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

- ఐడీ, ఎక్సైజ్, ఎఫ్‌జే వాష్ కేసులు 2023లో 684 నమోదయ్యాయి. 794 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 895.56 లీటర్ల మద్యం, 16,268.8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.
- 2024లో 1,043 కేసులు నమోదు కాగా.. 1,030 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3,399.99 లీటర్ల మద్యం, 17,603.5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2023 కంటే 2024లో కేసుల నమోదు 52 శాతం పెరిగింది.

ఎస్పీ ఏమన్నారంటే..: నాటుసారా తయారీ ప్రాంతాలలో విస్తృత దాడులు జరుపుతున్నామని చెప్పారు. డైనమిక్ వాహన తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం, నాటుసారా రవాణాను నియంత్రిస్తున్నామని తెలిపారు.

137 మంది తప్పిపోయారు..

2024లో 137 మంది తప్పిపోయారు. 89 శాతం వారిని తిరిగి కనుగొని, తల్లిదండ్రులు, సంరక్షకులకు పోలీసులు అప్పగించారు.

- ఈ ఏడాది 26 ముఖ్యమైన కేసుల్లో నిందితులకు శిక్ష పడింది. ఇందులో ఆరు కేసుల్లో జీవిత ఖైదు, మూడు కేసుల్లో 10 సంవత్సరాల కారాగారం ఉన్నాయి.
- జాతీయ లోక్‌అదాలత్‌కు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యమిచ్చింది. ఈ ఏడాది 1,233 కేసులు డిస్పోజ్ అయ్యాయి.

క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ..

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. అమాయకులనే లక్ష్యంగా చేసుకుని మాయ చేస్తున్నారు. సైబర్ నేరాల సంఖ్య 2023లో 36 ఉండగా.. ఈ సంఖ్య 2024లో 42కు చేరింది. ఈ ఏడాది దాదాపు రూ.2.79 కోట్ల మేర నగదును బాధితులు పోగొట్టుకోవడం గమనార్హం.

- 2023లో 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు 252 కాల్స్ వచ్చాయి. బాధితులు రూ.1,16,14,067లు నగదు కోల్పోయారు. అందులో రూ.15,90,783లు మేర వివిధ బ్యాంకుల్లో ఫ్రీజ్ చేయగలిగారు.
- 2024లో 1930 టోల్ ఫ్రీ నంబరుకు 474 కాల్స్ వచ్చాయి. బాధితులు రూ.2,79,14,903లు నగదు కోల్పోయారు. ఇందులో రూ.46,80,297లు వివిధ బ్యాంకుల్లో ఫ్రీజ్ చేయగలిగారు.

ఎస్పీ ఏమన్నారంటే : సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ మహిళా పోలీసులతో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని ఎస్పీ వివరించారు. డోర్ టు డోర్ వెళ్లి సైబర్ మోసాలు జరిగే తీరు, రుణ యాప్ వల్ల కలిగే అనర్థాలను వివరించామన్నారు. బ్యాంకర్లతోనూ సమావేశాలు నిర్వహించి, ప్రజలకు చైతన్యం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవగాహన బ్యానర్లను రద్దీ కూడళ్ల వద్ద, బ్యాంకులు, కళాశాలల వద్ద ఏర్పాటు చేశామని చెప్పారు. కరపత్రాలు, వాట్సాప్ గ్రూపుల్లోనూ వివరిస్తున్నామని తెలిపారు.

డ్రోన్ పోలీసింగ్: ఎస్పీ

జిల్లాలోని సిబ్బందికి డ్రోన్ ఆపరేటింగ్ మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించామని, వాటిని ఉపయోగించి నేరాల నియంత్రణ, అసాంఘిక కర్యకలాపాల అడ్డుకట్టకు వేస్తున్నామని ఎస్పీ మాధవ్‌రెడ్డి తెలిపారు. నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి దాతల సహకారంతో స్కూల్స్, కాలేజీ, బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రార్థన మందిరాలు, ముఖ్య కూడళ్ళ, వాణిజ్య సముదాయాల వవద్ద 296 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించి ఉచిత మెగా మెడికల్ క్యాంపు, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించామని తెలిపారు.

నెత్తురోడిన రోడ్లు



రహదారి భద్రతపై పోలీసులు ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ.. వాహనదారులు నిర్లక్ష్యం వీడడం లేదు. స్వయంగా జిల్లాకు చెందిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వాహన శ్రేణి ఈ ఆరు నెల్లో రెండుసార్లు ప్రమాదానికి కారణం కావడం గమనార్హం. కొద్ది నెలల కిందట రామభద్రపురం వద్ద మంత్రి ఎస్కార్ట్ వాహనం ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. గత నెలలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర వాహనాన్నే మంత్రి కాన్వాయ్‌లోని ఓ వాహనం సాలూరు మండలంలో ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో రాజన్నదొరకు త్రుటిలో ప్రమాదం తప్పింది.

- 2023లో రహదారి ప్రమాదాల్లో 275 కేసులు నమోదై.. 95 మంది మృతి చెందగా.. 2024లో 11 శాతం కేసుల సంఖ్య తగ్గింది. 245 కేసుల్లో 69 మంది మృతి చెందారు.
- రహదారి భద్రత చర్యల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 2024 లో 3,448 కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై ఈ ఏడాది 9,148 కేసులు, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపిన వారి మీద 900 కేసులు నమోదు చేశారు. మైనర్ డ్రైవింగ్ కేసులు 2023లో కేవలం 23 ఉంటే.. ఈ ఏడాది ఏకంగా 178 నమోదు కావడం గమనార్హం. ఎంవీ నిబంధనలు అతిక్రమించిన వారిపై ఈ ఏడాది 36,054 ఈ చలానాలు విధించారు.

ఎస్పీ ఏమన్నారంటే.. : రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యమిచ్చి.. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, వివిధ శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలీస్ అధికారులు.. వారి పరిధిలోని రహదారులు మీద ఏర్పడిన గుంతలు పూడ్చడం, మలుపుల వద్ద తుప్పలు/డొంకలు తొలగించడం, భద్రత ప్రమాణాలకు సంబంధించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల చాలా వరకు ప్రమాదాలను తగ్గించగలిగామని చెప్పారు. హెల్మెట్ లేకపోవడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి.. రహదారి భద్రతా నియమాలు పాటించేలా చైతన్యం చేస్తున్నామని చెప్పారు.

గం'జాయ్'గా...

ఒడిశా సరిహద్దు జిల్లా కావడంతో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగిపోతంది. ఇతర రాష్ట్రాల నుంచి పోలీసులు, చెక్‌పోస్టుల కళ్లు గప్పి, కొండ మార్గాల్లో గంజాయి జిల్లా మీదుగా తరలిపోతోంది.

- గంజాయి అక్రమ రవాణాదారులపై 2023లో 14 కేసులు నమోదు కాగా.. 28 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 205.640 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, అయిదు వాహనాలను సీజ్ చేశారు.
- 2024లో 179 శాతం పెరిగి 39 కేసులు నమోదయ్యాయి. 78 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 736.344 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 10 వాహనాలను సీజ్ చేశారు.

ఎస్పీ ఏమన్నారంటే : పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో విద్యార్థులకు, ప్రజలకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సంకల్పం అనే కార్యక్రమం ద్వారా 650కిపైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. విద్యాలయాలు, బస్టాండ్ల వద్ద 60కి పైగా డ్రాప్ బాక్స్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. 850కిపైగా బ్రోచర్లు పంపిణీ చేశామన్నారు. గంజాయిని అరికట్టేందుకు జిల్లాలో నాలుగు చెక్ పోస్టుల ద్వారా నిఘా పెట్టామని చెప్పారు. 247 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. డ్రోన్ల ద్వారా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెట్టినట్లు చెప్పారు.



ఇటీవల జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి మూటలు

పోలీస్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

విజయనగరం క్రైమ్: స్టైపండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల్లో భాగంగా దేహదారుఢ్య పరీక్షల ప్రక్రియ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు 600 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 321 మంది హాజరైనట్టు ఎస్పీ వకుల్‌జిందల్ తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు, ధ్రువపత్రాల పరిశీలన తర్వాత ఎత్తు, ఛాతి విస్తీర్ణం కొలతలు చేపట్టారు. ఇందులో అర్హత సాధించిన వారిని పీఈటీకి అనుమతించారు. ముందుగా నిర్వహించిన 1600 మీటర్ల పరుగు పందెంలో నిర్దిత సమయానికి చేరుకున్నవారికి 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. వీటిలో ఉత్తీర్ణత సాధించినవారికి అర్హత పత్రాలు అందజేశారు. నియామక ప్రక్రియను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు యానివర్స్, ఎం.వీరకుమార్, ఎస్.బాపూజీ, టి.ఎస్.శ్రీనివాసరావు, కె.థామస్‌రెడ్డి, ఏఓ పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

గోదాములో బియ్యం దొంగలు!

- బస్తాల నుంచి బియ్యం తీసేస్తున్న వైనం
- అంతా గోదాం సిబ్బంది కనుసన్నల్లోనే..
- ఒక్కో బస్తాకు 2 నుంచి 3 కిలోల తరుగు
- పట్టించుకోని గోదాం అధికారులు
- నష్టపోతున్న డీలర్లు

మెరకముడిదాం: అది రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాం. అక్కడ రేషన్ డిపోలకు సరఫరా చేసే బియ్యంను నిల్వ చేస్తారు. ఇదే.. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి వరంగా మారింది. ప్రతీ బస్తాకు 2 నుంచి 3 కిలోల వరకు కన్నంపెడుతున్నారు. వేలాది బస్తాల నుంచి బియ్యంను దొంగిలించి సొమ్ముచేసుకుంటున్నారు. రేషన్ డీలర్లకు నష్టం చేకూర్చుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు చెందిన గోదాం ఉంది. ఇక్కడ రేషన్ బియంతోపాటు మొక్కజొన్నను నిల్వ చేస్తారు. ఇక్కడ నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు, రేషన్‌దుకాణాలకు పౌరసరఫరాల అధికారులు బియ్యం సరఫరా చేస్తుంటారు. ఇక్కడ స్టాకు చేసిన వేలాది బియ్యం బస్తాలకు ఇక్కడ పనిచేస్తున్న కొందరు సిబ్బంది శంకు అనే వస్తువుతో రంధ్రాలను చేసి బియ్యం దొంగిలిస్తున్నారు. ప్రతి బస్తా నుంచి రెండు నుంచి మూడు కిలోల వరకు బియ్యం తీశాక గోనెలు సరిచేసి రంధ్రాలను కప్పివేస్తున్నారు. వేల కిలోల బియ్యాన్ని వేరేగా బస్తాలకు ఎత్తి వాటిని ఎవరికంటా పడకుండా రాత్రి వేళల్లో తరలిస్తున్నారు. రేషన్ డీలర్లకు నష్టం చేకూర్చుతున్నారు. బియ్యాన్ని దొంగిలిస్తున్న విషయం అధికారులకు తెలిసినా నిమ్మకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వందల కిలోల బియ్యంను అధికారులకు తెలియకుండా అక్రమార్కులు తీసేయడం కష్టసాధ్యమన్న వాదన వినిపిస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే బియ్యం దొంగల బాగోతం బయటపడుతుందని కొందరు బహిరంగంగానే చెబుతున్నారు. గోదాంలో బియ్యం దొంగతనం వ్యవహారాన్ని మేనేజర్ కె.అప్పారావు వద్ద ప్రస్తావించగా గోదాంలో స్టాకు ఉంచడం వరకే మా పని అని, ఎలాంటి అక్రమాలు జరగడంలేదని సెలవిచ్చారు.



భైరిపురం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాంలో ఉన్న బియ్యం బస్తాల నుంచి శంకుతో తీస్తున్న గోదాం ఉద్యోగి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- నూతన సంవత్సర వేళ ఒంటి గంట తరువాత రోడ్లపై తిరగొద్దు
- ఎస్పీ మాధవ్ రెడ్డి



పార్వతీపురం టౌన్: నూతన సంవత్సర వేడుకలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, వేడుకల పేరుతో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 31 రాత్రి బహిరంగ ప్రదేశాలు, రహదారులపై నూతన సంవత్సర వేడుకలను నిర్వహించరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడవరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలను అతివేగంగా నడిపినా, బైక్ రేసులు నిర్వహించినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్ధరాత్రి ఒంటి గంట తరువాత ప్రజలెవ్వరూ రహదారులపై తిరగరాదన్నారు. మైనర్లుకు వారి తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వరాదన్నారు. డిజే/లౌడు స్పీకర్లతో పెద్ద శబ్దం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకల పేరుతో మందుగుండు సామగ్రిని కాల్చడం, ప్రదర్శించడం లేదా ఉపయోగించినా నిబంధనలు అతిక్రమణ కిందకు వస్తుందన్నారు. మహిళలు, యువతులను వేధించడం, ఈవ్ టీజింగ్‌కు పాల్పడేవారిపై కేసులు నమోదుచేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు మాత్రమే మద్యం విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా మద్యం షాపులు, బార్ల పైన చర్యలు తప్పవన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో నూతన సంవత్సర వేడుకల నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవన్నారు.

హలో.. నా పేరు డైరీ..



హలో.. నా పేరు డైరీ. కొందరు దైనందిని అంటారు. ఇప్పటితరానికి నా గురించి అంతగా పరిచయం ఉండకపోవచ్చు. పాత తరానికి నేను ఆత్మీయ నేస్తాన్ని. నిత్యం నన్ను దనూర్తితో స్పృశించేవారు. ఏడాదిలో 365 రోజులూ (లీప్ సంవత్సరం వస్తే 366 రోజులు పాటు) తమ అనుభవాలు, అనుభూతులు, ఆలోచనలు, లెక్కలు, ఖర్చులు, ప్రణాళికలు.. ఇలా ఒకటేమిటి వారి అంతరంగమంతా నాపై అక్షరాలుగా పరిచేవారు. అవసరమైనప్పుడు, పాత రోజుల్లోకి వెళ్లాలనుకున్నప్పుడు నాలోని పేజీలు తిరగేస్తే గడిచినకాలం మళ్లీ కళ్లముందు కదలాడేది. సందర్భం, అందులోని విషయం ఆధారంగా వారి ముఖంలో దాదాపు నవరసాలు ప్రస్ఫుటమయ్యేవి. కొత్త ఏడాది వస్తుందంటే నన్ను సమకూర్చుకునేందుకు చాలా మంది ఆరాటపడేవారు. నాలోని రోజుకో పేజీని కేటాయించేవారు. కొందరైతే ఏం చేయాలి, ఎలా ముందుకెళ్లాలంటూ భవిష్యత్తుపై ఆశావహ దృక్పథంతో ప్రణాళిక చే(రా)సుకునేవారు. ఇంకొందరు తమ రాతలను పునఃశ్చరణ చేసుకొని లోటుపాట్లను అధిగమించే ప్రయత్నం చేసేవారు. చాలామంది నాలోని రాతలను నిజం చేసుకొని ఉన్నత స్థానాలకు వెళ్లి దశాబ్దాల కాలం పాటు తాము సాధించిన విజయాన్ని చిరస్మరణీయంగా భద్రపర్చుకునేవారు. సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతూ సామాజిక మాధ్యమాలు, బ్లాగుల్లో సందేశాలు, అభిప్రాయాలు పంచుకుంటున్నా.. నా పేజీలో రాసిన అక్షర సత్యం ఇచ్చే సంతృప్తి ఇవ్వదన్నది చాలామంది నోట వినిపిస్తోంది. యవ్వనంలో మీరు నింపిన నా పేజీలను మీ పిల్లలకు చూపిస్తే ఆ కిక్కేవేరన్నది మీకు తెలియని కాదు. ఆ రోజులు ఎలా ఉండేవి.. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకునే సూచనలను ప్రత్యేకంగా పిల్లలకు చెప్పాల్సిన పని ఉండదు. ఆ రోజు రానే వచ్చింది. నన్ను మరోసారి గుర్తుచేసుకుంటారని ఆశిస్తూ మీ ఆత్మీయ డైరీని.

– విజయనగరం

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి వనంగుడి, చదురుగుడి హుండీల ఆదాయాన్ని అమ్మవారి కళ్యాణ మండపం ఆవరణలో సోమవారం లెక్కించారు.

చదురుగుడి హుండీల నుంచి 73 రోజులకు రూ.46,98,625లు, 48 గ్రాముల 900 మిల్లీ గ్రాముల బంగారం, 671 గ్రాములు వెండి, వనంగుడి హుండీల నుంచి రూ.8,55,212లు, 1 గ్రాము 700 మిల్లీగ్రాములు బంగారం, 141 గ్రాముల వెండి లభించినట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ, ఉప కమిషనర్ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. ప్రత్యేక అధికారిగా రామతీర్థం దేవస్థానం ఈఓ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు క్లీనర్ మృతి

చీపురుపల్లి: మండలంలోని కర్లాం వద్ద వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమలో లారీలో కోళ్ల మేత అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడి లారీ క్లీనర్ దువ్వు రమణ(36) మృతి చెందినట్లు హెచ్‌సీ రమణ తెలిపారు. ఈ నెల 25న సాలూరు నుంచి లారీలో కోళ్ల మేతను డ్రైవర్ మహంతి బాలు, క్లీనర్ దువ్వు రమణలు తీసుకొచ్చారు. పరిశ్రమ వద్ద అన్‌లోడ్ చేసేందుకు క్లీనర్ రమణ కట్టు విప్పుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమవడంతో విజయనగరంలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్టణంలోని షీలానగర్‌లో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. చికిత్స పొందుతూ రమణ ఈ నెల 29న మృతి చెందినట్లు హెచ్‌సీ రమణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడు రమణ అవయవాలను కూడా ఆంధ్రా మెడికల్ కళాశాలలో దానం చేసినట్లు హెచ్‌సీ రమణ తెలిపారు.

ఆరుగురికి తీవ్రగాయాలు

- కారు, ఆటో, బైక్ ఢీకొనడంతో ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

గంట్యాడ: మండలంలోని కొర్లాం, తామరపల్లి గ్రామాల మధ్యలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోనంగి, మదనాపురం, ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వారు పనులు ముగించుకుని సోమవారం రాత్రి ఆటోలో స్వగ్రామాలకు వెళ్తుండగా అరకు నుంచి వస్తున్న ఓ కారు ఆటోను, ఆటో పక్కన వెళ్తున్న బుల్లెట్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బుల్లెట్‌పై వెళ్తున్న కానిస్టేబుల్ కింద పడిపోయాడు. అదేవిధంగా ఆటోలో ఉన్న నలుగురికి కారులో ఉన్న ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు స్పందించి 108 అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నలుగురిని తరలించగా, ఇద్దరు ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఈ ప్రమాదంలో బోనంగి గ్రామానికి చెందిన జుత్తాడ సత్యారావు, జుత్తాడ గణేష్, మదనాపురం గ్రామానికి చెందిన నక్కెల సింహాద్రినాయుడు, ధర్మవరం గ్రామానికి చెందిన దేవుపల్లి సన్యాసిరావులకు తీవ్రగాయాలయ్యాయి, అదేవిధంగా కొర్లాం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పాశల శ్రీను బొడ్డవర చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించేందుకు వెళ్తుంగా కారు ఢీకొట్టడంతో మూడు పల్టీలు కొట్టి కింద పడిపోగా తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లిపోయాడు. దీంతో కానిస్టేబుల్‌ను విజయనగరంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. మరో వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. రాత్రి వేళ ప్రమాదం జరగడంతో ఆ ప్రాంతంలో క్షతగాత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. సమాచారం మేరకు విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, గంట్యాడ ఎస్సై సాయికృష్ణలు సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు. అనంతరం గంట్యాడ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు

విజయనగరం అర్బన్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఖరగ్‌పూర్‌లో ఇటీవల జరిగిన 24వ జాతీయ జపాన్ కెన్యూర్యూ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల కరాటే క్రీడాకారులు ఐదుగురు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవ మణి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ జూనియర్ విభాగంలో పి.హేమంత్ (కాటా, కుమిటి కేటగిరిల్లో బంగారు పతకాలు), పి.కుశ్వంత్ కుమార్ (కాటాలో బంగారు, కుమిటిలో రజతం), కె.శివగణేష్ (కాటాలో బంగారు, కుమిటిలో కాంస్యం), ఎం.హర్షవర్ధన్ (కాటా, కుమిటీలో రెండు రజత పతకాలు) సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎంసత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్‌కిరణ్, ఎస్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపునాయుడు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్‌హెచ్ ప్రసాద్ పాల్గొని విజేతలను అభినందించారు.

- వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌కు స్పందించిన యువకుడు
- రూ. 8.95 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

ఆశ చూపారు.. రూ.లక్షలు కాజేశారు..



రాజాం సిటీ: ప్రజల అవసరాలను బలహీనతగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలను అనుసరించి మాయ వలను విసురుతున్నారు. సెల్‌ఫోన్ వేదికగా బురిడీ కొట్టించి ఖాతాలను గుల్లచేస్తున్నారు. వాట్సాప్ వేదికగా ఓ వ్యాపారిని బురిడీ కొట్టించి రూ. 8.95 లక్షలు కాజేశారు. రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కు తెలిపిన వివరాల ప్రకారం... రాజాం పట్టణ పరిధి డోలపేట గ్రామానికి చెందిన కురిమేటి వెంకట దేవీ ప్రసాదరావు బొబ్బిలి కూడలి సమీపంలో ఆప్టికల్స్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయనకు జె.వాసవీ వివాహ పెళ్లి చూపులు పేరిట వాట్సాప్ గ్రూపు ఉంది. ఈ గ్రూపులో వచ్చిన మెసేజ్‌కు ఆయన స్పందించాడు. వెంటనే సంబంధిత సైబర్ నేరగాళ్లు ఫైనాన్స్ ఇస్తామని, ఆసక్తి ఉన్నవారు తమను సంప్రదించాలని వ్యక్తిగతంగా మెసేజ్ చేశారు. దీనికి స్పందించి వారితో సంప్రదించగా మా అకౌంట్‌కు ముందుగా రూ.3,800లు పంపిస్తే లోన్ ప్రాసెస్ జరుగుతుందని చెప్పారు. దీనికి స్పందించిన ఆయన ఆ మొత్తాన్ని వారి అకౌంట్‌కు జమచేశాడు. అనంతరం నేరగాళ్లు మళ్లీ ఫోన్‌చేసి రూ.5లక్షలలోన్ మీకు వర్తిస్తుందని, ముందుగా మీరు రూ.30వేలు అకౌంట్‌కు కట్టాలని సూచించారు. దీనికి అంగీకరించకపోతే రూ.2 లక్షల లోన్ చేస్తాం రూ.15వేలు కట్టాలని సూచించారు. దీంతో రూ.15వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు మళ్లీ ఫిర్యాదుదారుకి ఫోన్‌చేసి మీకు రూ.5 లక్షలు మంజూరైందని, మీరు మిగతా రూ.15వేలు చెల్లించాలని సూచించడంతో ఆ మొత్తాన్ని కూడా వారు సూచించిన అకౌంట్‌కు చెల్లించాడు. మళ్లీ సదరు ఫిర్యాదుదారుని సంప్రదించి మీరు మొత్తం రూ. 30వేలు ఒకేసారి చెల్లిస్తేనే ఆ రూ. 5 లక్షలు అప్రూవల్ అవుతుందని చెప్పారు. ఇలా దఫదఫాలుగా రూ. 8,95,900లు వరకు వారి ఖాతాకు ఫిర్యాదుదారుడు వివిధ బ్యాంకు అకౌంట్లు నంబర్లు, ఫోన్‌పే స్కానర్లు ద్వారా జమచేశాడు. లోన్ డిపాజిట్ చేసేందుకు సదరు నేరగాళ్లు మళ్లీ ఇతనిని డబ్బులు అడగడంతో మోసపోయినట్టు గుర్తించి పోలీసులను సోమవారం ఆశ్రయించాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మూడు నెలల వ్యవధిలో ఇద్దరు బాధితులు

మూడు నెలల వ్యవధిలో రాజాం పట్టణానికి చెందిన ఇద్దరు బాధితులు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కారు. పోలీసులు, ప్రభుత్వాలు ఎంతగానో అవగాహన కల్పిస్తున్నప్పటికీ అత్యాసకు పోతున్న ప్రజలు మోసపోవాల్సి వస్తోంది. తెలగవీధికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బి.వెంకటేష్ సైబర్ వలకు చిక్కి ఏకంగా రూ. 7.50 లక్షలు, వాట్సాప్ గ్రూపు ద్వారా డోలపేటకు చెందిన కేవీడీ ప్రసాదరావు రూ.8.95 లక్షలు పోగొట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అపరిచితమైన లింకులు క్లిక్ చేసి మోసపోవద్దని అన్నారు. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కకుండా జాగ్రత్తపడాలని సూచించారు.

30 శాతం కూరగాయల పంటకు నష్టం

- మండల ఉద్యానశాఖాధికారి మోహనకృష్ణ
- సాక్షి కథనానికి స్పందన



కుళ్లిన ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

రామభద్రపురం: మండలంలోని ఉల్లి, టమోటా, చిక్కుడు, వంగ, బెండ, బీర, కాకర తదితర కూరగాయల పంటలతో పాటు ఆకుకూరలు, దుంప జాతి పంటలు సుమారు 30 శాతం మేర నష్టం జరిగిందని మండల ఉద్యానశాఖాధికారి పి.మోహనకృష్ణ తెలిపారు. బంగాళాఖాతంలో డిసెంబర్‌లో ఏర్పడిన వరుస తుఫాన్‌లతో కురిసిన వర్షాలకు రైతు కుటుంబాలు ఆరుగాలం శ్రమించి సాగుచేసిన కూరగాయల పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఇదే అంశంపై ఈ నెల 29వ తేదీన 'కుదేలైన కూరగాయల రైతు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉద్యానశాఖాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు మండల ఉద్యానశాఖాధికారి మోహనకృష్ణ రామభద్రపురం మండలంలో కూరగాయల పంటలు పరిశీలించారు. నష్ట నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తానని తెలిపారు. ఆయన వెంట ఉద్యానవన సిబ్బంది చొక్కాపు అప్పలనాయుడు, హైమావతి ఉన్నారు.

మొక్కల బొకేలను వినియోగించాలి

- కలెక్టర్ అంబేడ్కర్ పిలుపు



మొక్కల బొకే విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: అభినందనలు తెలియజేసేటప్పుడు జ్ఞాపికలుగా మొక్కలతో చేసిన బొకేలను వినియోగించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. స్థానిక వీటీ అగ్రహారంలోని టీటీడీసీ ప్రాంగణంలో జిల్లా సమాఖ్య ఏర్పాటు చేసిన మొక్కల బొకే విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. పూల బొకేలకు బదులుగా బొకే మొక్కలను వినియోగించుకోవడం అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

సాలూరు: వచ్చే నెల 5వ తేదీన సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర స్త్రీశిశుసంక్షేమ,గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడిసంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళా పత్రికలను ఆవిష్కరించారు

ప్రభుత్వ అంబులెన్సులను ఆపితే చర్యలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద రోగులను ఏమార్చి ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రైవేటు అంబులెన్సు సిబ్బంది తరలిస్తున్నారనే ఆరోపణలపై సాక్షిలో ఈనెల 24వతేదిన 'ప్రైవేట్ అంబులెన్సుల నిర్వాహకుల దందా' శీర్షికన ప్రచురించిన కథనానికి రవాణాశాఖ అధికారులు స్పందించారు. సోమవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో ప్రైవేట్ అంబులెన్సుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలోకి వచ్చే ప్రభుత్వ అంబులెన్సులను ఆపితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ హెచ్చరించారు.

అత్యాచారాల కేసులు సత్వరమే పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

- రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి

విజయనగరం అర్బన్: జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అత్యాచారాలపై నమోదైన కేసులు సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కులస్తులకు సంబంధించిన కనీస హక్కులను కాపాడవలసిన బాధ్యత అధికారులందరిపైనా ఉందన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోందని తెలిపారు. వారి రక్షణ కోసం రూపొందించిన చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలపై కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ స్పందించి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కాలనీలలో ఆక్రమణకు గురైన శ్మశానాలు, భూ సమస్యలను గుర్తించి 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆర్డీఓలకు సూచించారు. ఈ సమస్యలపై స్థానిక ఎస్సై, తహసీల్దార్, సర్వేయర్ ముగ్గురూ కలిసి తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

ప్రతి నెలా సివిల్ రైట్స్ డే

అత్యాచారాల నిరోధక చట్టంపై ప్రజలకు అవగాహన కలిగించాలని సభ్యులు చిట్టిబాబు, సూర్యనారాయణ కలెక్టర్‌ను కోరగా చట్టంపై అవగాహన కలిగించేందుకు ప్రతి నెల 30న మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇకపై ఆ మినిట్స్ కాపీని కూడా కమిటీ సభ్యులకు అందజేయనున్నట్లు తెలిపారు. కోర్టులో 251 కేసులు పెండింగ్ ఉన్నాయని, అవి సత్వరమే డిస్పోజ్ అయ్యేలా చూడాలని పీపీని కోరారు. అందుకు అవసరమైన సాక్ష్యాలను వేగంగా సమర్పించాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, సభ్యులు పి.చిట్టిబాబు, బసవ సూర్యనారాయణ, సున్నపు రామస్వామి, చంపి సన్యాసిరావు, మజ్జి గణపతి, ఎస్సీ ఎస్టీలతో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రెడ్డి రాజగోపాల్ నాయుడు, ఎం.రాము, అధికారిక సభ్యులు మత్స్యశాఖ డీడీ నిర్మలకుమారి, ఏపీజీఎల్ఐ ఏడీజీ హైమవతి, ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలమాంబ జాతర వైభవంగా నిర్వహిద్దాం

- అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి సంధ్యారాణి
- పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ



పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి



జాతర రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి పండగ రాష్ట్ర పండగా కావడంతో జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా సమష్టికృషితో పనిచేద్దామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని శంబర గ్రామంలో సోమవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన పోలమాంబ అమ్మవారి జాతరపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి సంధ్యారాణి ముందుగా చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ మంత్రి సంధ్యారాణిని సాదరంగా స్వాగతించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం చదురుగుడి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి సంధ్యారాణి పరిశీలించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహించాలని మంత్రి సంధ్యారాణి అధికారులకు సూచించారు. ఆర్టీసీ, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మెడికల్ అండ్ హెల్త్, విద్యుత్‌శాఖ అధికారులతో మంత్రి సంధ్యారాణి సమీక్ష చేశారు. జాతరకు సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, ఎస్.కోట, పాలకొండ డిపోల నుంచి 66ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు. జాతర మూడురోజులే కాకుండా, జాతరకు ముందు, తరువాత ఆదివారం, బుధవారాల్లో కనీసం 20బస్సులు నడపాలని మంత్రి సంధ్యారాణి ఆదేశించారు. అలాగే మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా అమలుచేయాలని చెప్పారు. తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌ల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుచేయాలన్నారు. శంబరపోలమాంబ అమ్మవారి జాతరతో పాటు, చుట్టుపక్కల 14గ్రామాల్లో గ్రామదేవతల పండగలు ఆదే సమయంలో జరగనున్నాయని, మక్కువ మీదుగా ఆయా గ్రామాలకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలగకుండా పంపించే ఏర్పాట్లు పోలీస్‌శాఖ చేపట్టాలని మంత్రి సంధ్యారాణి సూచించారు. అలాగే 8చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. మక్కువ, చినభోగిలి రహదారుల మధ్య గోతులను పూడ్చివేయించాలని ఆర్ అండ్‌బీ అధికారులకు మంత్రి సంధ్యారాణి సూచించారు.

జాతరను ఘనంగా నిర్వహించుకుందాం

జాతరను ఘనంగా నిర్వహించుకుందామని కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జాతరలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. పారిశుధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు జరిపించాలని చెప్పారు. వీఆర్ఎస్ ప్రాజెక్ట్ సమీపంలో గజఈతగాళ్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్‌స్థలాలు ఏర్పాటుచేయాలని, అందుకోసం రహదారుల మలుపుల వద్ద తుప్పలు తొలగించాలని చెప్పారు. జాతరకు వచ్చే భక్తులకు మెండుగా సౌకర్యాలు కల్పించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. జాతర రోడ్డుమ్యాప్‌ను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డిలు పరిశీలించారు.

జాతరలో 500మంది పోలీస్‌బందోబస్తు

పోలమాంబ అమ్మవారి జాతరలో 500మందికి పైగా పోలీస్ బందోబస్తును ఏర్పాటుచేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సీసీ కెమెరాలు, కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. అనంతరం పోలమాంబ అమ్మవారి జాతర వాల్‌పోస్టర్‌ను మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్, ఏఎస్పీ అంకిత్‌సురానా, ఈవో సూర్యనారాయణలు ఆవిష్కరించారు. సమీక్షాసమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రతి వినతికి సంతృప్తికర పరిష్కారం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- 137 వినతుల సేకరణ



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్



వినతులను పరిశీలిస్తున్న డీఆర్ఓ హేమలత



వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఒక్క వినతికి అర్జీదారు సంతృప్తిచెందే రీతిలో సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా అధికారులు పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. అర్జీదారుల సమస్యను పూర్తిగా విని అర్థం చేసుకున్న తర్వాత సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలని సూచించారు. సమస్య పరిష్కరించేటప్పుడు సంబంధిత అర్జీదారు ప్రభుత్వ శాఖలు చూపిన పరిష్కారంపై సంతృప్తిగా ఉన్నారా లేదా అనేది తెలుసుకోవాలన్నారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ జిల్లా అధికారులతో వినతుల పరిష్కారంపై సమీక్షించారు. ఇందుకు సంబంధించి 30 వినతులు సరిగా పరిష్కరించని కారణంగా రీఓపెన్ చేశామని వాటిని ఆయా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్, డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి తదితరులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 137 వినతులు స్వీకరించారు. అనంతరం విశాఖలో ఇటీవల జరిగిన విభిన్న ప్రతిభావంతులు జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో తృతీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్టును కలెక్టర్ అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ బాట్స్‌మన్‌గా ఎంపికైన కె.లిఖిత్, బౌలర్‌గా ఎంపికైన ఆర్.హరికృష్ణలను కలెక్టర్ అభినందించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఇన్‌చార్జ్ ఎ.డి పి.బాలాజీ ఉన్నారు.

శాశ్వత పరిష్కారానికి చర్యలు

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులను ఆదేశించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 134 వినతులను ఆమె స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పీజీఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపనున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌సెల్‌కు 27 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రాజెక్టుఅధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 27 వినతులు వచ్చాయి. కొండాడ నుంచి మేడఒబ్బంగికి సీసీ రహదారి నిర్మించాలని బెన్నరాయికి చెందిన సూగన్న కోరారు. అక్కన్నగూడ గ్రామానికి చెందిన సవర పెద్దబాపన్న హౌసింగ్ బిల్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించాడు. గెద్దగూడకు పాఠశాల భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరారు. బెన్నరాయికి సెల్ టవర్ ఏర్పాటు చేయాలని సవర సూగన్న వినతిపత్రం అందజేశాడు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజీలేని పోరాటంతోనే సమస్య పరిష్కారం



మాట్లాడుతున్న జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ

పార్వతీపురంటౌన్: రాజీలేని పోరాటంతోనే సమస్యల పరిష్కారం అవుతాయని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పి.రంజిత్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌వై నాయుడు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణలు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజన గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. 42 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా ఉండడం సరైంది కాదన్నారు. గిరిజన మంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతూ కాలం గడుపు తున్నారన్నారు. కనీస వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ అమరావతిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనాయక్ తదితరులను అరెస్టు చేశారని, తక్షణమే వారిని విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు దివాకర్, రమేష్, రాజేష్, వెంకట్, మురళి, కామేష్, ఉమ, దీప, షర్మిల, కవిత, అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: నిరుద్యోగ యువతీయువకుల కోసం ప్రభుత్వం కంపెనీలను తెచ్చేందుకు ఆలోచన చేస్తుంటే యువతీయువకులు శ్రద్ధ చూపకపోవడం బాధాకరంగా ఉందని రాష్ట్ర, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎన్నారై సాధికారత, సంబంధాలు శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం గజపతినగరంలోని సాయిసిద్ధార్థ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు కోటి15లక్షల మంది నిరుద్యోగ యువతీయువకులు ఉన్నారని అటువంటి వారి కోసం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గాలు చూపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జనసేన నాయకుడు మర్రాపు సురేష్, సాయిసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ ఎస్.శేఖర్ బాబు, లెంక బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

221మంది ఎంపిక

గజపతినగరం సాయిసిద్ధార్థ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి 417మంది హాజరు కాగా 221మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు సాయిసిద్ధార్థ విద్యాసంస్థల కరస్పాండెంట్ రెడ్డి శేఖర్ బాబు సోమవారం సాయంత్రం తెలిపారు.

రోల్డ్ గోల్డ్ నగలు చోరీ

విజయనగరం క్రైమ్: ఇంట్లో చొరబడి బీరువాలు పగులగొట్టి బంగారం అనుకుని రోల్డ్‌గోల్డ్ నగలు చోరీ చేసిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సోమవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కంటోన్మెంట్ ఎల్‌బీ కాలనీకి చెందిన ఎస్.సురేష్ ఈ నెల 29న సాయంత్రం రాకోడులో ఉన్న బంధువుల ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లాడు. మరుచటి రోజు ఉదయం పక్కింటివాళ్లు ఫోన్ చేసి ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పడంతో 9 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తీసి ఉన్నాయి. హాల్, బెడ్‌రూమ్‌లో ఉన్న రెండు బీరువాలు విరగ్గొట్టి చిందరవందరగా ఉన్నాయని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే బీరువాలో ఉన్న రోల్డ్ గోల్డ్ ఆభరణాలను బంగారం అనుకుని దొంగ పట్టుకుపోయాడని, పిల్లల హుండీలో ఉన్న రూ. 350 చిల్లరడబ్బులు తీసుకెళ్లిపోయాడన్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వనంగుడిలో చండీయాగం..

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారికి మూలానక్షత్రం పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో సోమవారం చండీయాగం నిర్వహించారు. వేదపండితులు తాతా రాజేష్ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



యాగంలో పాల్గొన్న భక్తులు